ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు

సంపుటి : 10 సంచిక : 19 పుష్పం : 39-40 20-06-2005

రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్ష పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥100/-
విడి ప్రతి : రు॥ 8/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

26-12-04
భీమవరం ................. 1

12-01-05
కాపవరం .................. 8

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-12-04, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకి భగవంతుడు కావాలి అంటే సహించటం నేర్చుకోవాలి. ఏదైనా బాహ్యవిషయాలు సాధించటానికి మనం చాలా కష్టపడతాము, సహిస్తాము, అవసరమైతే మాటలు కూడా పడతాము. కాని భగవంతుడి విషయంలో మనకు సహనం లేదు, ఆయనను పొందటానికి మనం ఏమీ కష్టపడటంలేదు, ఏమీ లేకుండా మనకు జ్ఞానం వచ్చేయాలి, మనకు భగవంతుడు తెలియబడాలి, అది ఎలా సాధ్యమవుతుంది. మనకు తెలిసినా, తెలియకపోయినా మన హృదయంలో ఒక సత్యం ఉంది. అయితే అది మనకు ఎందుకు తెలియటంలేదు అని చాలామంది నాస్తికులు అడుగుతారు. అది ఎందుకు తెలియటం లేదు అంటే ఉన్న దానిని నీవు లేదుఅని అనుకొంటున్నావు, లేనిదానిని ఉంది అనుకొంటున్నావు, అందుచేత మన హృదయంలో సత్యం ఉన్నప్పటికీ అది మనకు తెలియటం లేదు అని మనం వారికి చెప్పాలి. ఆయనను తెలుసుకోవటానికి నీవు ఏమైనా శ్రమపడ్డావా, కష్టపడ్డావా, ఏదైనా సహించావా? ఏమీ లేదు కాని భగవంతుడు తెలియబడాలి అంటున్నావు. మీరు జీవితంలో కొన్ని కష్టాలు పడి ఉండవచ్చు, కాని భగవంతుడిని తెలుసుకోవటానికి మీరు ఏమి కష్టపడ్డారు, మీరు ఏమి ప్రయత్నం చేసారు అదీ మిమ్మల్ని అడిగేది. మన గురించి మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు, ఆ విషయం మనం మర్చిపోతున్నాము. మన గురించి మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసుకాబట్టి ఆయనతో మానసిక

అనుబంధం పెట్టుకొంటే, ఆయనను నిరంతరం స్మరిస్తూ ఉంటే మనకు మనోనిగ్రహం కలుగుతుంది, మనస్సు నశిస్తుంది, జ్ఞానం కలుగుతుంది. మనలను ఎలా సరిదిద్దాలో, మనకు ఎలా మారుమనస్సు తీసుకొనిరావాలో ఆయనకు బాగా తెలుసుకాబట్టి మనం ఆయనను జపించటం వలన, ధ్యానించటం వలన మనలను సంస్కరించి ఆయన మనకు వ్యక్తమవుతాడు, వాడే ఈశ్వరుడు. మనందరకు దేహం ఉంది, దేహం లోపల జీవుడు ఉన్నాడు. ఈ దేహం లోపల మనం ఎలా ఉన్నామో, ఈ సృష్టి అంతా భగవంతుడి శరీరం అనుకొంటే ఆ శరీరంలో ఆయన అలా ఉన్నాడు. మనస్సు ఉన్న వాడికి దేహం ఉంది, దేహం ఉన్న వాడికి లోకం ఉంది, మనస్సు లేనివాడికి దేహం లేదు, లోకం లేదు. మనస్సు ఎక్కడ నుండి వస్తోంది అంటే మన హృదయంలో ఉన్న సత్యం దగ్గరనుండి వస్తోంది. మనం అక్కడకు దిగగలిగితే, అందులో మునగగలిగితే సత్యం మనకు ఎరుకలోనికి వస్తుంది, అప్పుడు జననమరణచక్రంలో నుండి బయటకు వస్తావు. మన హృదయంలో సత్యం లేకపోతే, భగవంతుడు లేకపోతే మనకు నేను అనే తలంపు లేదు, నేను అనే తలంపు లేకపోతే మనస్సు లేదు, మనస్సు లేకపోతే దేహం లేదు, దేహం లేకపోతే లోకం లేదు, మనం అంత లోపలకు వెళ్ళాలి. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే మనం నుయ్యి తవ్వేటప్పుడు నీళ్ళు దొరికే వరకు పైనున్న మట్టిని తీస్తూనే ఉంటాము. నీళ్ళను మనం కనిపెట్టము, పైనున్న మట్టిని తీసేస్తాము. అలాగే నీ హృదయంలో సత్యం ఉంది, అది నీకు ఎరుకలోనికి రాకుండా ఏవైతే అడ్డు వస్తున్నాయో ఆ మట్టిని అంతా తీసి ఒక ప్రక్కన పెట్టు. అదే మనం చేయవలసిన పని, అప్పుడు జ్ఞానగంగ నీకు ఎరుకలోనికి వస్తుంది. సత్సంగము అంటే రమణమహర్షితో, రామకృష్ణుడుతో మానసికఅనుబంధం కూడా సత్సంగమే అంటే మహర్షులతో, మహాత్ములతో మానసిక అనుబంధం కూడా సత్సంగమే. మనం ఇంటిలో కూర్చొని వారిని స్మరించుకోవటం కూడా సత్సంగమే. శరీరాన్ని అక్కడ కూర్చోబెట్టనక్కరలేదు, మనస్సులో వారిని స్మరించుకోవటం కూడా సత్సంగమే. నీలోపల ఉన్న సత్యవస్తువును ఎరుకలోనికి తెచ్చుకోవటానికి, సత్యానుభవం పొందటానికి సత్సంగం అవసరం. అసత్యాన్ని సత్యంగా చూడటం, అనిజాన్ని నిజంగా చూడటం, చెడ్డను మంచిగా చూడటం తగ్గించుకొంటూ రావాలి, అదే పెద్ద సాధన. అంటే మనం కానిదానిని అవును అనుకొంటున్నాము. దానిని జాగ్రత్తగా ఎలిమినేట్ చేసుకొంటూ రావాలి, అదే సాధన, దానికి మించిన సాధన లేదు. సత్సంగం వలన ప్రాపంచికవిషయాలతో సంబంధం తగ్గుతుంది. మనం కొన్ని విషయాలు చదువుతాము కాని మనకు అర్థం కాదు అంటే శబ్దం అర్థమవ్వదు అని కాదు, దాని లోతు తెలియదు. అహంభావన ఉంటే అంతా

ఉంది, అది లేకపోతే ఏదీలేదు అని మనం చదువుతున్నాము, ఆవాక్యం మనకు ఎంతవరకు అర్థమయ్యింది. అహంభావన అంటే అక్కడ కోపంకాదు, అహంభావన అంటే దేహాత్మభావన, దేహమే ఆత్మ అనుకొనే భావన నీకు ఉన్నప్పుడు అంతా ఉంది, నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, ప్రపంచం ఉంది, మంచి ఉంది, చెడ్డ ఉంది, కర్మ ఉంది, కర్మఫలదాత ఉన్నాడు, అన్నీ ఉన్నాయి, అది లేకపోతే ఏదీ లేదు. ఇది మనం రోజూ చదువుతున్నాము కాని మన గుండెకి పట్టటం లేదు. వారికి ఉపకారం చేసాము, వీరికి ఉపకారం చేసాము అని మనం అనుకొంటూ ఉంటాము, అది నీ బుద్ధితక్కువతనానికి గుర్తు అంటున్నారు భగవాన్. నువ్వు ఎవరికి ఉపకారం చేసావు, అక్కడ ఉన్నవాడు ఎవడు? నీవే ఆ రూపంలో ఉన్నావు. వాడికి ఉపకారం చేసాను అనుకొంటున్నావు కాని నూటికి నూరుపాళ్ళు నీకు నీవే ఉపకారం చేసుకొంటున్నావు, జరిగేది ఇది. జ్ఞానోదయం కలగటానికి అది నీకు సహకరిస్తుంది అని మరిచిపోయి ఎవరినో ఉద్ధరిస్తున్నాను అని నువ్వు అనుకొంటున్నావు, దాని వలన అహంభావన పెరుగుతుంది. నిన్ను నీవు ఉద్ధరించుకొంటున్నావు అన్న సంగతి మర్చిపోయి ఎవరినో ఉద్ధరిస్తున్నాను అని నువ్వు అనుకొంటున్నావు. ఏసుక్రీస్తు శరీరాన్ని ఎలా శిలువ వేసారో అలాగ మన అహంభావనను శిలువ వేయండి, అప్పుడు నీకు అద్వైతభావన కలుగుతుంది. ఎవరైనా గర్వంతో మాట్లాడుతూ ఉంటే, రాగద్వేషములతో మాట్లాడుతూ ఉంటే, ఉద్రేకంగా మాట్లాడుతూ ఉంటే చిన్నపిల్లలను మర్చిపోయారా అనేవాడు ఏసు. చిన్న పిల్లలు ఎంత నిర్మలంగా ఉంటారో చూడండి, వారిని ఎవరైనా తిట్టినా, తల్లి కొట్టినా వెంటనే మర్చిపోతారు మరల అమ్మా అంటారు. వారి మనస్సును, వారి హృదయాలను జ్ఞాపకం పెట్టుకోండి, మీలో రజోగుణం తగ్గుతుంది అన్నాడు ఏసు. మనకు ఏదైనా కష్టం వచ్చింది అనుకోండి కాలప్రవాహం కొంతవరకు ఆ కష్టాన్ని తీరుస్తుంది. ఈ లోపుగా మనం ఏమి చెయ్యాలి అంటే చిరాకులేకుండా, విసుగులేకుండా దానిని సహించగలగాలి, మన శరీరానికి ఏదైనా రోగం వచ్చినా, మనస్సుకు బాధ వచ్చినా, ఇంటిదగ్గర ఆర్థికపరిస్థితులు బాగాలేక పోయినా ఇవన్నీ మనం సహించాలి, అదే తపస్సు, అప్పుడు వాడు ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవు తాడు. తపస్సు అంటే ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికో పారిపోవటం కాదు. కొంతమందికి అదృష్టం వెంటాడుతుంది, కొంతమందికి దురదృష్టం వెంటాడుతుంది. అదృష్టం వచ్చినప్పుడు పొంగి పోకూడదు, దురదృష్టం వచ్చినప్పుడు కృంగిపోకూడదు, అది తపస్సు. మనం జయం వచ్చినప్పుడు ఒకలాగ, అపజయం వచ్చినప్పుడు ఒకలాగ ఉంటాము, ఇవిఅన్నీ అహంకారానికే. నీకు జయం వచ్చినా, అపజయం వచ్చినా ఏమీలేదు, రెండూ కూడా స్వప్నమే. నువ్వు

ఎవరిగా ఉన్నావో దానిని చింతించటం మానేసి నువ్వు కానిదానిని చింతిస్తున్నావు. అందుకే ఇన్ని తలంపులు, ఇన్ని బాధలు, ఇన్ని గొడవలు వస్తున్నాయి. మాకు తలంపులు వచ్చేస్తున్నాయి, ఆలోచనలు వచ్చేస్తున్నాయి అని ఎవరి ఇంటికి వెళ్ళినా ఇదే గొడవ. నువ్వు ఏదైతే అవునో దానిని విడిచిపెట్టి మిగతావి అన్నీ చింతిస్తున్నావు. నువ్వు ఆలోచించేది అనాత్మ గురించి, నువ్వు ఏది ఆలోచిస్తున్నావో అదే అవుతావు, ఇంక నీకు ఆత్మ ఎలా దొరుకుతుంది. ఆత్మను చింతిస్తే నీకు ఆత్మానుభవం కలుగుతుంది. నువ్వు ఆత్మను చింతించటం లేదు, అనాత్మను చింతిస్తున్నావు. అందుచేత నీకు తలంపులు మిగులుతాయి, వేదనలు రోదనలు మిగులుతాయి, జనన మరణాలు మిగులుతాయి. దైవాన్ని విడిచిపెట్టి నీవు ఇతర విషయాలను చింతిస్తూ ఉంటే నీకు తలంపులు వస్తున్నాయి, దైవాన్ని చింతిస్తూ ఉంటే నీకు తలంపులు ఆగిపోతాయి. ఆగిపోవటమే కాదు నీ బాధ్యతను ఆయన స్వీకరిస్తాడు, నీ రక్షణను ఆయన స్వీకరిస్తాడు. బుడగ సముద్రంలో నుండే వచ్చింది. బుడగ ఏమనుకొంటుంది అంటే పగిలి పోతే నేను ఏమైపోతాను అనుకొంటుంది, ఏమీ అవ్వదు సముద్రమే అవుతుంది. బుడగ వెనకాల సముద్రం ఎలా ఉందో అలాగే మన నామరూపముల వెనకాల చైతన్యం ఉంది. ఈ రూపబుద్ధి, నామబుద్ధి భంగపడిన వెంటనే నీవు చైతన్యంలో ఐక్యమవుతావు. ఈ రూపం కోసం, నామం కోసం మనం జీవితం పొడుగునా ఏడుస్తూ ఉంటాము. ఈ రూపానికి, నామానికి ఆధారంగా ఉన్న చైతన్యం ఇంక మనకు ఎలా తెలుస్తుంది, అది నీకు తెలియబడదు. రూపబుద్ధిని, నామబుద్ధిని ఎవడూ విడిచిపెట్టడు, పోనీ విడిచిపెట్టలేకపోతున్నాము అని కూడా వాడు అనుకోడు. కొంతమంది లోపల గర్వం పెట్టుకొని మాటలు చమత్కారంగా మాట్లాడుతూ పైకి గర్వం కనబడకుండా చూసుకొంటారు, అటువంటి వేషాలు వేయవద్దు అని ఏసు చెపుతున్నాడు. లోపల వినయం, నమత్ర, నిరాడంబరతను పోషించుకోవాలి. కొంతమందికి బాహ్యంగా ఎన్ని ఆస్థులు ఉన్నా లోపల బీదవాడిగా ఉంటారు, వాడికి కదా స్వర్గరాజ్యం అంటాడు ఏసు. వాడికి ఎన్ని ఆస్థులు ఉన్నా వాటితో తాదాత్మ్యం పొందడు, ఏదో దేహప్రారబ్ధాన్నిబట్టి వచ్చింది అనుకొంటాడు అంతే. ఈ మధ్య పెద్దధనవంతుడితో ఒకమాట అన్నాను, మీకు చాలా ధనం వచ్చేసింది అన్నాను. ఆయన ఏమి చెప్పారు అంటే నూటికి 99 మంది ధనాన్ని కోరుకొంటున్నారు కదా మరి వారికెందుకు రావటం లేదు. నేను కోరుకొంటే వస్తే వారికి కోరుకుంటే రావాలి కదా. ఇది దేవుడు ఇచ్చాడండి దీనికి నాకు గర్వం ఎందుకు, పొగరుబోతుతనం ఎందుకు అన్నాడు. బాహ్యమైనసంపదలతో తాదాత్మ్యం పొందుతూ ఉంటే మీ మనస్సు అణగదు, దానికి అసలు లోచూపు రాదు. సూది బెజ్జంలో నుండి

ఒంటెను బయటకు లాగగలము కాని ధనవంతుడిని స్వర్గరాజ్యంలోనికి పంపలేము అని చెప్పాడు ఏసు.

మనం ఈశ్వరుడిని ఉపాసిస్తున్నాము, జ్ఞానాన్ని ఉపాసిస్తున్నాము అని అనుకొంటున్నాము కాని మనం దేహభావనను, అజ్ఞానాన్ని ఉపాసిస్తున్నాము. అందుచేత మనకు బతికి ఉండగా దుఃఖం, చనిపోయిన తరువాత కటిక చీకటిలోకాలు మిగులుతాయి. దొంగకు పోలీసు వేషం వేసి దొంగను పట్టుకోరా అనటం ఎటువంటిదో నీవు మనస్సుచుట్టూ తిరుగుతూ, ఇంద్రియాలచుట్టూ తిరుగుతూ ఆత్మజ్ఞానం పొందాలి అనుకోవటంకూడా అటువంటిదే. వాడు దొంగను పట్టుకోడు, వెతుకుచున్నాను అంటాడు కాని వెతకడు నీ టైము అంతా పాడుచేస్తాడు. నీ మనస్సు చేసే మాయ కూడా అలాగే ఉంటుంది. మన మనస్సు కలుషితమై పోవటానికి, బుద్ధి పాడైపోవటానికి రాగద్వేషములే కారణం. ఇతరులు ఎవరైనా రాగద్వేషాలతో కూడిన మాటలు చెపుతూ ఉంటే అసలు మనం వాటిని వినకూడదు. వాటిని పట్టించుకోకూడదు. నువ్వు ఎవడినయినా ప్రేమిస్తూ ఉంటే భగవంతుడినే ప్రేమిస్తున్నావు, అక్కడ ఉన్నవాడు భగవంతుడే. భగవంతుడు లేకుండా అక్కడ ఆ శరీరం రాదు. నీలో ఉన్నవాడు, వాడిలో ఉన్నవాడు వేరుకాదు, ఇక్కడ ఉన్నవాడే అక్కడా ఉన్నాడు, నీకు వేరుభావన వలన ఎవడికో చేస్తున్నాను అనిపిస్తుంది. నాకు నేనే చేసుకొంటున్నాను అనే భావన నీకు కనుక ఉంటే అప్పడే అక్కడే నీకు నారాయణుడు స్వరూపంగా వ్యక్తమౌతాడు. మనం మనస్సులో ఏదీ మోయకూడదు. మనం ఏదైనా గుడి కట్టించాము అనుకోండి. మేము గుడి కట్టించాము అని అనుకొంటూ ఉంటే మనం చనిపోయాక గుడి మన కూడా రాదు కాని నేను కట్టించాను అనే తలంపు మాత్రం మనకూడా వస్తుంది, ఇలా మనస్సులో మోస్తూ ఉండటం వలన లోపల కుళ్ళిపోతాము. మంచిపనిని మనం చేసి మర్చిపోవాలి, అంతేగాని మనస్సులో మోసే బదులు ఆ పని చెయ్యకుండా ఉండటమే మంచిది, నీకు ఎవరైనా అపకారం చేసినా నిజంగా నీవు వారిని క్షమించగలిగితే అది నీవు మర్చిపోతావు, నిజంగా నీవు క్షమించలేకపోతే అది నీకు మరుపురాదు. చాలా మంది కోరికలకోసం గుడికి వెళతారు. భక్తికోసం, భగవంతుడి కోసం గుడికి వెళ్ళేవారు ఎంతమంది ఉన్నారు. నాకు కావలసింది భగవంతుడు కల్పించిన వస్తువులు కాదు, భగవంతుడు కల్పించిన మాయ కాదు, నాకు కావలసింది భగవంతుడే అంటుంది మీరాభాయి.

రామకృష్ణపరమహంస ఏమి చెపుతున్నారు అంటే పిల్లల దగ్గర మీరు అనేకరకాల

వస్తువులు, బొమ్మలు పడేస్తారు, వారు ఆ బొమ్మలతో కొంతసేపు ఆడుకొంటారు. అలా కొంతసేపు ఆడుకొన్నాక అమ్మ జ్ఞాపకం వచ్చి ఆ వస్తువులు అక్కడ ఉండగానే అమ్మా, అమ్మా అని ఏడుస్తారు. ఇంకా నీవు కొత్త బొమ్మలు ఇచ్చినా వాటివంక చూడరు. అమ్మా అని ఏడుస్తారు. అలాగే నీవు ఈ లోకంలో ఉన్న మనుషులతోటి, సంఘటనలతోటి, వస్తువులతోటి టైర్ అయినప్పుడు ఆ పిల్లవాడు వస్తువులన్నీ వదిలేసి అమ్మకోసం ఏవిధంగా అయితే ఏడుస్తాడో అలాగే నీవు దేవుడు కోసం ఏడుస్తావు, అప్పుడు కదా నీకు దేవుడు దొరికేది అంటున్నాడు రామకృష్ణుడు. ఇంతవరకు నీవు లోకం కోసం ఏడ్చావు, ఇంక ఎంతకాలం ఇలా ఏడుస్తావు, ఏడ్చింది సరిపోతుంది, ఇప్పటినుంచి అయినా ఈశ్వరునికోసం ఏడువు, ఆయనవైపు నీ మొఖం త్రిప్పు. మనబుద్ధి రాగద్వేషములతో పాడైపోయి ఉంది. అందుచేత భగవంతుడు చెప్పిన మాటలు అన్నీ సత్యం అయినప్పటికీ మన బుద్ధిలో ఉన్న దోషం వలన అవిఅన్నీ అసత్యం కింద మనకు కనిపిస్తున్నాయి. గీతలో ఏదో చెప్పాడండీ అది మాకు తెలియటం లేదు అంటారు. నీకు తెలియదు కాబట్టే భగవంతుడు చెపుతున్నాడు. మనం ప్రశాంతంగా కూర్చొని ఏ విషయాల వలన మన మనస్సు బయటకు ఆకర్షింపబడుతోందో, చూసుకొని ఆ ఆకర్షణలను కనుక తగ్గించుకోగలిగితే మన మనస్సు నిశ్చలమవుతుంది, నిర్మలమవుతుంది. నీ మనస్సు ఎప్పుడైతే నిర్మలమయిందో, నిశ్చలమయిందో, ఏకాగ్రమయిందో అప్పుడు అది నిర్మలంగా ఉన్న, నిశ్చలంగా ఉన్న సత్యవస్తువులో ఐక్యమయిపోతుంది. మన శరీరంకంటే, మన ఇంద్రియాల కంటే, మన మనస్సు కంటే అత్యంత సమీపంగా సత్యవస్తువు మన హృదయంలోనే ఉంది. కాని మనం ఏమనుకొంటున్నాము అంటే అది ఎక్కడో ఉంది, ఈ శరీరం చనిపోతేగాని అది మనకు తెలియదు అనుకొంటున్నాము, ఈ గొడవలు అన్నీ తెచ్చేది దేహం నేను అనే తలంపు, అందుచేత అందులోనుండి విడుదలపొందు. నీ బట్టలకు ఎంత విలువ ఇస్తున్నావో, నీ శరీరఆరోగ్యానికి ఎంతవిలువ ఇస్తున్నావో కనీసం అంతవిలువ అయినా దేహం మరణించిన తరువాత నీకూడా వచ్చే జీవుడికి ఇవ్వవా, ఆ జీవుడిని బాగుచేసుకోవటానికి ప్రయత్నం చేయవా అంటున్నాడు. శరీరం మరణించిన తరువాత మోక్షం పొందటం కాదు సజ్జనసాంగత్యం వలన నువ్వు ఈ శరీరంలో ఉండగానే, ఈ శరీరం ఇక్కడ తిరుగాడుతున్నప్పడే నీవు మోక్షస్థితిని అనుభవిస్తావు, సజ్జనసాంగత్యం అంతదూరం తీసుకొని పోతుంది. చల్లనిగాలి వచ్చి నీ శరీరాన్ని తాకుతున్నప్పడు, నీ శరీరాన్ని సుఖపెడుతున్నప్పడు ఇంక విసనకర్రతో పని ఏముంది. అలాగే సజ్జనసాంగత్యం నీకు దొరికినప్పడు ముక్కలోగాలి

చూసుకోవటంతో నీకు పని ఏముంటుంది. రాముడు అంటే ఆత్మ. రాముడు అంటే ఆనందింపచేసేవాడు, అటువంటి రామనామం చేసుకోవటానికి ఉదయం అని, సాయంత్రం అని, సంధ్య వేళ అని సంబంధం లేదు, ఎప్పుడయినా చేసుకోవచ్చు, దానికి టైములిమిట్ ఏమీ లేదు. దేవుడు జీవుడై వచ్చి నేను జీవుడినే అనేవాడు రాముడు. మనం జీవలక్షణాలు అన్నీ పెట్టుకొని నేను దేవుడిని అనుకొంటున్నాము, ఎంత బాగుందో చూడండి. నీ గురించి నీ కంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు, అటువంటి వాడిని స్మరించుకోవటానికి, ధ్యానించు కోవటానికి నీకు అభ్యంతరం ఎందుకు? పరమాచార్య ఒకసారి ఏమని చెప్పారు అంటే మనం తలపోటు వస్తే భరించలేకపోతున్నాము, ఎవరైనా చిన్నమాట అంటే భరించలేక పోతున్నాము. ఏదైనా చిన్న కష్టం వస్తే తట్టుకోలేకపోతున్నాము, కోడలు ఏదైనా అంటే పడలేము, ఏదీ మనం భరించలేకపోతున్నాము. ఇంక మన పాపాలు ఎప్పుడు పోతాయి అన్నారు అంటే పాపాలు పోవని చెప్పటం. వెన్నెల వలన తాపం పోతుంది, గంగాజలం వలన పాపం పోతుంది. కాని సజ్జనసాంగత్యం వలన అన్నీ పోతాయి. అంటే తీర్థాలుకాని, గుడిలో పెట్టిన ప్రతిమలుకాని ఇవన్నీ సజ్జనసాంగత్యంతో సమానం కాదు. సత్పురుషులు పుస్తకాలు వ్రాయకపోవచ్చు, ప్రసంగాలు చెయ్యకపోవచ్చు, కాని వారు జ్ఞానాన్ని ఇవ్వటమే, అది సజ్జన సాంగత్యంలో ఉన్న గొప్పతనం. ఆ సమక్షంలో మనం మారుమనస్సు పొందుతాము, అతడు ఏ స్థితిని పొంది ఉన్నాడో ఆ స్థితి వైపుకు నీ మొఖం తిరుగుతుంది, అట్టిది నేను కూడా పొందాలి అనే అభిలాష నీకు కలుగుతుంది. అమెరికాలో వివేకానందుడు, ఒక ధనవంతుడు ఒకచోట నాలుగురోజులు కలిసి ఉన్నారు. అమెరికానుండి వచ్చేక ఒక సంవత్సరానికి ఆ ధనవంతుడు వివేకానందుడికి ఒక ఉత్తరం వ్రాసాడు. నేను అమెరికాలో ఫలానాచోట ఒక మంచి పని చేసాను అని వ్రాసాడు. వివేకానందుడు తిరిగి ఏమని వ్రాసాడు అంటే నాలుగు రోజులు మీరు నాతో కలిసి ఉండటం వలన ఆ మంచి పనులు చేయాలనే బుద్ధి కలిగింది, లేకపోతే ఆ బుద్ధి మీకు కలుగదు అని ఉత్తరం వ్రాసాడు, అదీ సజ్జనసాంగత్యం. వివేకానందుడు పేరు మొత్తం అనలేక కొంతమంది దొరలు మిస్టర్ ఆనంద్ అనేవారు. నాపేరు వివేకానంద, మీకు ఎంత సేపు ఆనందం గొడవేకాని వివేకం అక్కరలేదా అనేవాడు. మిమ్మల్ని స్తోత్రం చేసేవారు ఉంటారు, విమర్శించేవారు ఉంటారు, అది భరించగలగటం, సహించగలగటం తపస్సు. మనకు ఇష్టంలేని సంఘటనలు జరిగినా వాటిని భరించగలగటం తపస్సు. తపస్సు అంటే అన్నం తినటం మానివేయటం, ప్రాణాయామం చేయటం తపస్సు అనుకొంటున్నారు, మీరు భరించగలగటం తపస్సు, ఈశ్వరుడు చెప్పిన మాటను ప్రమాణంగా తీసుకొని

జీవించటం తపస్సు. మన ఇంట్లో మనం ఉండవచ్చు, మన డ్యూటీ మనం చెయ్యవచ్చు, కాని అది మమకార రహితంగా ఉండాలి. వ్యక్తిభావన లేకుండా చేయాలి. మనం వ్యక్తి భావన తగ్గించుకోవాలి, సమిష్టిభావన పెంచుకోవాలి. భగవాన్ ఒకమాట చెప్పారు. నామరూపాలకు ఆధారంగా ఏ వస్తువు అయితే ఉందో ఆ వస్తువును చూడకుండా, ఆ వస్తువును ప్రేమించకుండా మీ ప్రేమను కేవలం ఈ రూపానికి, నామానికి కనుక పరిమితం చేస్తే ఎప్పటికయినా పడరాని కష్టాలు, పడరాని నష్టాలు, పడరాని దుఃఖాలు ఆ రూపం, నామం మీకు తెచ్చిపెడుతుంది. ఇవి ఒక మనిషి చెప్పిన మాటలు కాదు, చైతన్యం నోరుపెట్టుకొని మాట్లాడుతోంది. మీ అమ్మాయిని మీరు ప్రేమిస్తున్నారు అనుకోండి, ఎప్పటికయినా మీ అమ్మాయి శత్రువు అయ్యింది అనుకోండి, ఆ సంతోషం అంతా దుఃఖం కింద మారిపోతుంది. రూపబుద్ధికి, నామబుద్ధికి మీరు కట్టుబడి ఉన్నంతకాలం, వాటికే మీరు పరిమితమై ఉన్నంతకాలం మీ ప్రేమలు, అనుబంధాలు, ఆకాంక్షలు అన్నీ రెట్టింపుకు రెట్టింపు వడ్డీతోసహా దుఃఖం కింద మారిపోయి తిరిగి మీకే వస్తాయి. భగవాన్ చెప్పిన మాటలు మనం వినటానికి చేదుగా ఉండవచ్చు కాని అది అల్టిమేట్ ట్రూత్. మీ ఇంట్లో వ్యక్తులను మీరు ప్రేమించండి, అది డ్యూటీ అనుకొని చేయండి. ప్రపంచంలో అనేక జీవకోటి ఉంది, వారిలో కొందరిని భగవంతుడు మీ ఇంటికి కేటాయించాడు. వారు భగవంతుడు తరపున వచ్చారు. వారిని భగవంతుడు మనకు కేటాయించాడు అనుకొని మీరు డ్యూటీ చేయండి అంతే. గురువు నీకు బయట నుండి ఏమీ తెచ్చి ఇవ్వడు. నీ స్వరూపం నీకు ఎరుకలో లేదు. నీ స్వరూపం నీకు ఎరుకలోనికి రాకుండా ఏవైతే ఆటంకాలు ఉన్నాయో వాటిని తొలగిస్తాడు, వాడే గురువు. మీకు అహంకారం తలకెక్కిపోయి ఉంది అనుకోండి, దానిని ఎలా తొలగించాలి, ఎప్పుడు తొలగించాలి ఆ ముహూర్తం ఆయన పెట్టుకొని, ఒక ప్లాన్ ప్రకారం దానిని తొలగిస్తాడు, దానినే డివైన్ ప్లాన్ అంటారు. అనుకొనేది జీవుడిసంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. భగవంతుడు సత్యసంకల్పుడు. మనం అనుకొనేవి జరగవు కాని భగవంతుడు ఏదైనా అనుకొంటే జరగవలసిందే.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-01-05, కాపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవద్గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే కర్మఫలాన్ని ఆశించినా, ఆశించక పోయినా ఫలం వస్తుంది. కర్మఫలాన్ని నీవు ఆశించటం వలన బంధింపబడతావు, కర్మఫలాన్ని